సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శనివారం । 11 । నవంబర్ । 2023



సోమశిలలో 29.859 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో శుక్రవారం సాయంత్రానికి 29.859 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 125 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



బంగారం ధరలు


24 క్యారెట్లు (10 గ్రాములు)	-రూ.62,220
22 క్యారెట్లు ఆర్నమెంటు (గ్రా)	రూ.5,588
3 శాతం జీఎస్టీతో..	- రూ.5,756
నవర (8 గ్రా)	- రూ.46,048

గరిష్టం/కనిష్టం
32.0 /25.3

వాతావరణం

శుక్రవారం గాలిలో తేమ 68 శాతం ఉంది. శనివారం జిల్లావ్యాప్తంగా ఉష్ణోగ్రతలు, ఎండతీవ్రత సాధారణంగా ఉంటాయని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

ప్రజారోగ్య రక్ష



గతంలో ఆరోగ్యం సరిగా లేకపోతే ప్రజలు ప్రభుత్వ ఆస్పత్రికో, ప్రైవేట్ హాస్పిటల్‌కో వెళ్లి వైద్యసేవలు పొందేవారు. వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లితే రకరకాల పరీక్షల పేరుతో రోగుల నుంచి డబ్బులు దోచేసేవారు. ఈ పరిస్థితిని గమనించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేసింది. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రూపకల్పన చేసి గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో శిబిరాలు నిర్వహించి ప్రజలకు అవసరమైన వైద్యసేవలు అందించింది.



నెల్లూరు నగరం పొదలకూరు రోడ్డులోని యూపీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన సురక్ష శిబిరంలో పేర్లు నమోదు చేసుకుంటున్న ప్రజలు (ఫైల్)

జిల్లాలో..

నియోజకవర్గాలు 8	సచివాలయాలు 769
గృహాలు - 8,44,243	ఆరోగ్య సర్వే పూర్తి చేసింది - 7,68,671 ఇళ్లలో..
నిర్వహించిన ఆరోగ్య సురక్ష శిబిరాలు 663	వైద్యసేవలు పొందినవారు - 2,44,866 మంది

నెల్లూరు(పొగతోట)/నెల్లూరు సిటీ: ప్రజారోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. పేద ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేసింది. ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా ఆపరేషన్లు, కంటి అద్దాలు, మందులు అందించింది. జిల్లాలోని 8 నియోజకవర్గాల్లో ఉన్న సచివాలయాల పరిధిలో ఈ ఏడాది సెప్టెంబర్ 30 నుంచి నవంబర్ 8వ తేదీ వరకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు నిర్వహించి వైద్యసేవలు అందించింది. ఈ శిబిరాల్లో వైద్యసేవలు పొందిన ప్రజలు గతంలో ఏ ప్రభుత్వం ఇలా వైద్యసేవలు అందించిన దాఖలాలు లేవంటూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఇంటింటి సర్వేతో రోగుల గుర్తింపు

గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజల ఆరోగ్య రక్షణకు అవసరమైన చర్యలు చేపట్టింది. జిల్లావ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా లక్షలాది మంది ప్రజలకు డాక్టర్లు, సిబ్బంది వైద్యసేవలు అందించారు. తొలుత గ్రామ, వార్డు వలంటీర్లు ఇంటింటి సర్వే నిర్వహించి ప్రజలకు అవసరమైన వైద్యసేవలను గుర్తించారు. ఎవరెవరికి ఎలాంటి వ్యాధులు ఉన్నాయి.. వారికి అందించాల్సిన వైద్యసేవల వివరాలను సేకరించారు. సచివాలయాల పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు నిర్వహించి ప్రజలకు అవసరమైన వైద్యసేవలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. జిల్లాలోని 769 సచివాలయాల పరిధిలో మొత్తం 8,44,243 గృహాలు ఉన్నాయి. వాటిలో 7,68,671 ఇళ్లలో ఆరోగ్య సర్వే పూర్తి చేశారు. రూరల్‌లో 497, అర్బన్‌లో 166 ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించాలని లక్ష్యంగా నిర్దేశించారు.



జగనన్న ఆరోగ్య సురక్షలో రోగులకు బీపీ చెక్ చేస్తున్న సిబ్బంది (ఫైల్)

లక్షలాది మందికి వైద్యసేవలు

జిల్లావ్యాప్తంగా మొత్తం 663 ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించారు. గత నెల 31వ తేదీతో రూరల్ ప్రాంతాల్లో 497 వైద్యశిబిరాలను పూర్తి చేశారు. ఈ నెల 8వ తేదీతో అర్బన్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాల నిర్వహణ పూర్తయింది. మొత్తం 2.91 లక్షల మందికి వివిధ రకాల వైద్యసేవలు అవసరమని గుర్తించి అందులో 2,44,866 మందికి వైద్యసేవలు అందించారు. 91,974 మందికి రక్తపరీక్షలు, 14,586 మందికి బీపీ, 9,384 మందికి షుగర్ ఉన్నట్లు గుర్తించి ఉచితంగా మందులు అందజేశారు. 'కంటి వెలుగు' ద్వారా 59,362 మందికి పరీక్షలు నిర్వహించారు. 6,722 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. 4,920 మందికి మెరుగైన వైద్యం అవసరమని గుర్తించి ఆస్పత్రులకు సిఫార్సు చేశారు. స్పెషలిస్ట్ డాక్టర్లతో వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకున్నారు. ఆపరేషన్లు అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ఆస్పత్రుల ద్వారా ఆపరేషన్లు చేయించనున్నారు. దానికి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇక జిల్లాలో 7,22,522 మందికి ఆరోగ్యశ్రీ కార్డులను అందజేశారు. ఇలా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా జిల్లావ్యాప్తంగా వైద్యసేవలు పొందిన ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం



జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాల్లో 2.44 లక్షల మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఎవరికి ఎలాంటి వైద్యసేవలు అవసరమో గుర్తించి వాటిని అందించేలా చర్యలు తీసుకున్నాం. ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. జిల్లావ్యాప్తంగా ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతమైంది.

– ఎం.హరినారాయణన్, కలెక్టర్

ఇంటింటి సర్వే



జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు నిర్వహించే ముందు గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహించి ప్రజలకు అవసరమైన వైద్యసేవలను గుర్తించాం. ఆరోగ్య సురక్ష శిబిరాలకు వచ్చిన వారికి డాక్టర్లు పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్యసేవలను అందించారు. మందులు కూడా ఉచితంగా అందజేశారు.

– సుస్మితారెడ్డి, డీపీఓ

న్యూస్‌రీల్

ఈవీఎంల తనిఖీ పకడ్బందీగా నిర్వహించండి

• కలెక్టర్ ఎం.హరినారాయణన్



ఈవీఎంల తనిఖీ ప్రక్రియ పరిశీలనకు వస్తున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు రూరల్: ఈవీఎంల తనిఖీ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా, జాగ్రత్తగా పూర్తి చేయాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్, సంబంధిత అధికారులను ఆదేశించారు. నెల్లూరు రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయ ప్రాంగణంలోని ఈవీఎంల గోడౌన్‌లో ఈవీఎంల పర్యవేక్షణ అధికారి, బెల్ ఇంజినీర్ల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈవీఎంల తనిఖీ ప్రక్రియను శుక్రవారం కలెక్టర్ పరిశీలించారు. ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఆర్వో లవన్న, ఈవీఎంల పర్యవేక్షణాధికారి, తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్ బి.చినఓబులేసు ఉన్నారు.

కొత్త పనులు గుర్తించండి



మాట్లాడుతున్న పంచాయతీరాజ్ జాయింట్ కమిషనర్ శశిధర్‌రెడ్డి

నెల్లూరు(పొగతోట): ఉపాధి హామీకి సంబంధించి గ్రామీణ ప్రాంతాల్లో నూతన పనులను గుర్తించాలని పంచాయతీరాజ్ జాయింట్ కమిషనర్ శశిధర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం నెల్లూరులోని డ్వామా కార్యాలయంలో ఏపీడీలు, ఏపీఓలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం అభివృద్ధి చెందేలా ఉపాధి హామీ పనులు చేపట్టి పూర్తి చేయాలన్నారు. రానున్న ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పనులకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. అవినీతికి తావులేకుండా పనులను చేపట్టాలని, అవినీతికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో డ్వామా అడిషనల్ పీడీ సుజాత పాల్గొన్నారు.


అమరవీరులను స్మరించుకుందాం



అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న అటవీ అధికారులు, సిబ్బంది

నెల్లూరు(బారకాసు): అడవుల సంరక్షణలో భాగంగా విధులు నిర్వర్తిస్తున్న సమయంలో ప్రాణత్యాగాలు చేసిన అటవీ అమరవీరులను స్మరించుకోవడం అందరి బాధ్యత అని అటవీశాఖ జిల్లా అధికారి(టెరిటోరియల్) చంద్రశేఖర్ పేర్కొన్నారు. రాష్ట్ర అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం నగరంలోని నిప్పో సెంటర్ సమీపంలోని జిల్లా అటవీశాఖ కార్యాలయం ఆవరణలో ఉన్న అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఎఫ్ఓ మాట్లాడుతూ అడవుల సంరక్షణకు సంబంధిత సిబ్బంది చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో నెల్లూరు, రాపూరు, ఆత్మకూరు, ఉదయగిరి, కావలి రేంజర్లు మాల్యాద్రి, రవీంద్రబాబు, రామకొండారెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి, రామ్మోహన్‌రావు, పలువురు జూనియర్ ఫారెస్ట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కామాక్షితాయి సేవలో జడ్జి



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడలో వెలసిన శ్రీమల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారిని జిల్లా ఐదో అడిషనల్ సెషన్స్ జడ్జి ఎస్.సరస్వతి శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ లక్ష్మీ సుబ్రహ్మణ్యంనాయుడు, ఈఓ గిరికృష్ణ ఆలయ మర్యాదలతో జడ్జికి స్వాగతం పలికారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుదాం

• వారానికి రెండు సార్లు గ్రామ సందర్శన
• ఫాస్ట్ ట్రాక్ కేసులపై ప్రత్యేక దృష్టి
• నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి





విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన నవాబుపేట ఇన్‌స్పెక్టర్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి, పాల్గొన్న అధికారులు

నెల్లూరు(క్రైమ్): అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపి ప్రజలకు మెరుగైన శాంతిభద్రతలు అందించాలని ఎస్పీ కె.తిరుమలేశ్వరరెడ్డి పోలీసు అధికారులకు సూచించారు. స్థానిక ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్ హాలులో ఆయన శనివారం నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. సర్కిల్స్ వారీగా గ్రేవ్, నాన్ గ్రేవ్, ఆస్తి సంబంధిత నేరాలు, పోక్సో, రేప్, ఎస్సీ, ఎస్టీ కేసుల నమోదు, కేసుల ఛేదన తదితరాలపై క్షుణ్ణంగా సమీక్షించారు. కేసులు పెండెన్సీని తగ్గించేందుకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ చట్టవ్యతిరేక కార్యకలాపాలను కట్టడి చేసి ప్రజలందరూ శాంతియుత వాతావరణంలో జీవించేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పోలీసు సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంతోపాటు నేర నియంత్రణలో వారిని భాగస్వాములను చేయాలని సూచించారు. ప్రజలతో సన్నిహితంగా మెలిగినప్పుడే పోలీసుల పట్ల గౌరవం, విశ్వాసం పెరుగుతుందన్నారు. అందుకుగాను ప్రతి అధికారి తమ స్టేషన్ పరిధిలో వారానికి రెండు గ్రామాలను విధిగా సందర్శించి అక్కడి ప్రజలతో మమేకమై వారి సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాలకు సంబంధించి బ్లాక్‌స్పాట్లలో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని, ప్రమాదాల నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వాహన తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు ముమ్మరం చేయాలన్నారు. నిబంధనల ఉల్లంఘనులపై ఈ-చలానా ద్వారా జరిమానాలు విధించాలన్నారు. ఫాస్ట్ ట్రాక్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి నిందితులకు శిక్షలు పడేలా చూడాలని ఆదేశించారు. ఎస్ఓఎస్ కాల్స్ వచ్చిన వెంటనే స్పందించి సకాలంలో ఘటనా స్థలానికి చేరుకుని బాధితులను రక్షించాలని తెలిపారు. దీపావళి సందర్భంగా అనధికార బాణసంచా విక్రయాలు, అక్రమ నిల్వలపై దాడులు చేసి కేసులు నమోదు చేయాలన్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న బాణసంచా గోదాములు, తయారీ కేంద్రాలు, విక్రయదుకాణాలు నిబంధనలు విధిగా పాటిస్తున్నారా? అగ్నిమాపక పరికరాలను ఏర్పాటు చేశారా? భద్రతా ప్రమాణాలను పాటిస్తున్నారా లేదా తనిఖీ చేయాలని ఆదేశించారు. పోలీసు సంక్షేమంలో భాగంగా ఈ నెల 15న ఓఈ(ఓరల్ ఎంక్వైరీ) మేళాను నిర్వహిస్తున్నామని, సిబ్బంది వినియోగించుకోవాలని సూచించారు. కేసుల ఛేదన, నిందితుల సత్వర అరెస్ట్, కేసుల పెండెన్సీ తగ్గించడంలో ప్రతిభ కనపరిచిన పలువురు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. సమావేశంలో ఏఎస్పీలు డి.హిమవతి, ప్రసాద్, శ్రీనివాసరావు, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి, జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిర్మూలన అందరి బాధ్యత

• న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి వాణి



బాల్యవివాహాల నిరోధక చట్టంపై అవగాహన కల్పించే పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

నెల్లూరు(బారకాసు): బాల్యవివాహాలను నిర్మూలించడం అందరి బాధ్యత అని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వాణి పేర్కొన్నారు. బాల్యవివాహాల నిరోధన, పర్యవేక్షణ నగరపాలక సంస్థ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని శుక్రవారం నెల్లూరులోని కార్పొరేషన్ కార్యాలయం ఏపీజే అబ్దుల్‌కలాం సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కలెక్టర్ ఆధ్వర్యంలో బాల్యవివాహాల చట్టం 2020 ప్రకారంగా వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులు, ప్రజాప్రతినిధులతో నగరపాలక సంస్థలో మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బాల్య వివాహాలకు నిరక్షరాస్యత, పేదరికం ప్రధాన కారణాలని, నిర్బంధ విద్యను అమలు చేయడం వల్లనే మంచి ఫలితాలను సాధించగలమని తెలిపారు. మేయర్ స్రవంతి మాట్లాడుతూ బాల్య వివాహాలను అడ్డుకోవడానికి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్న విషయం తెలిస్తే సమీపంలోని పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్, సీడీపీఓ, పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, గ్రామ, వార్డు సచివాలయం, అంగన్‌వాడీ కార్యకర్త, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు వ్యక్తిగతంగానూ లేదా ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వవచ్చని తెలిపారు. కమిషనర్ వికాస్‌మర్మత్ మాట్లాడుతూ బడి మెట్లు ఎక్కాల్సిన బాలికలు పెళ్లి పీటలెక్కుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చట్ట ప్రకారం అమ్మాయికి 18 ఏళ్లు, అబ్బాయికి 21 ఏళ్లు నిండితేనే వివాహం జరిపించాలన్నారు. ఈ సందర్భంగా పలువురు తమ సూచనలు, సలహాలను అధికారులకు తెలియజేశారు. అనంతరం బాల్యవివాహాల నిరోధక చట్టంపై అవగాహన కల్పించే పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో కార్పొరేటర్లు, వైద్యాధికారులు, పోలీసు అధికారులు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, మెప్మా, ఐసీడీఎస్, నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఖతర్నాక్ సుధీర్

• తక్కువ ధరకే బంగారం, నోట్ల మార్పిడి మోసాల్లో దిట్ట
• నకిలీ పోలీసుల అవతారంతో నేరాలు
• ఏపీతోపాటు ఇతర రాష్ట్రాల్లోనూ దోపిడీలు
• ఎట్టకేలకు పోలీసులకు చిక్కిన నిందితుడు



పోలీసులు అరెస్ట్ చేసిన సుధీర్ (ముసుగులో ఉన్న వ్యక్తి)

నెల్లూరు(క్రైమ్): ప్రజల అత్యాశ, బలహీనతలే అతని పెట్టుబడి.. పెద్దగా చదువుకోకపోయినప్పటికీ వివిధ భాషల్లో అనర్గళంగా మాట్లాడగలడు. సీజన్‌ను బట్టి నోట్ల మార్పిడి, తక్కువ ధరకే బంగారం, నకిలీ పోలీసుల ముసుగులో నేరాలు, మోసాలకు పాల్పడతాడు. మోసపోయిన బాధితులు తాము ఇచ్చిన నగదు ఇవ్వాలని అడిగితే భౌతిక దాడులకు పాల్పడుతూ చంపుతామని బెదిరిస్తాడు. అతడే ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన కేసులో ప్రధాన నిందితుడు, ఘరానా మోసగాడు దేవరకొండ సుధీర్ అలియాస్ అజయ్‌రెడ్డి. ఇతను ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. పోలీసుల వివరాల మేరకు.. కావలి తుఫాన్‌నగర్‌కు చెందిన సుధీర్ తన స్నేహితులతో గ్యాంగ్‌ను ఏర్పాటు చేసి తన నేర సామ్రాజ్యాన్ని విస్తరించాడు. మార్కెట్ ధర కన్నా తక్కువ ధరకు బంగారం, నోట్ల మార్పిడి పేరిట రాష్ట్రంతోపాటు తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల్లోనూ మోసాలకు పాల్పడుతూ రూ.కోట్లకు పడగలెత్తాడు. మోసపోయిన బాధితులు తామిచ్చిన నగదు ఇవ్వాలని ప్రశ్నిస్తే భౌతికదాడులకు పాల్పడడంతోపాటు చంపుతామని బెదిరింపు చర్యలకు దిగుతుండడంతో అనేక మంది మిన్నకుండిపోయారు. గతంలో ఒకరిద్దరు ఫిర్యాదు చేయగా పోలీసులు అతనిని అరెస్ట్ చేశారు. జైలుకు వెళ్లినా అతని ప్రవర్తనలో మార్పురాలేదు. తిరిగి యథేచ్ఛగా నేరాలకు పాల్పడుతూనే ఉన్నారు. నకిలీ పోలీసుల ముసుగులో నేరాలకు పాల్పడడం ఈ గ్యాంగ్ ప్రత్యేకత.

2013 నుంచి..

సుధీర్ గ్యాంగ్ 2013 నుంచి మోసాలకు పాల్పడుతూనే ఉంది. మార్కెట్ ధర కన్నా తక్కువ ధరకే బంగారం ఇస్తామని గ్యాంగ్ సభ్యులతోపాటు తెలిసిన వారి ద్వారా ప్రచారం చేయిస్తారు. ఎవరైనా అతనిని సంప్రదిస్తే మార్కెట్‌లో కేజీ రూ.50 లక్షలు ఉండగా తాను రూ.35 లక్షలకు ఇస్తానని చెప్పి తొలిసారి చెప్పిన విధంగానే బంగారం అందజేసి నమ్మకాన్ని సంపాదించుకుంటాడు. దీంతో అత్యాశకుపోయి కేజీల్లో బంగారం కావాలని అతనిని సంప్రదించడమే తరువాయి.. డబ్బు తీసుకుని చెన్నైలో బంగారం ఇస్తామని వారిని తన వెంట తీసుకెళతాడు. చెన్నైలో ఓ మనిషిని అప్పచెప్పి అతని వద్ద బంగారం ఉందని మీ ఇంటికి చేరుస్తారని నమ్మబలికించి అతనిని వారి వెంట రైలులో ఎక్కిస్తారు. రైలు కొద్దిదూరం వెళ్లిన అనంతరం నకిలీ పోలీసుల అవతారమెత్తి రైలులో బంగారంతో ఉన్న మనిషిని అరెస్ట్ చేసి తమ వెంట తీసుకెళతారు. పోలీసులను చూడగానే బాధితులు ఎక్కడ తమను అరెస్ట్ చేస్తారోనని మిన్నకుండిపోతున్నారు. ఇలా పదుల సంఖ్యలో అనేక మందిని సుధీర్ గ్యాంగ్ మోసగించి రూ.కోట్లు కాజేసింది. నోట్ల రద్దు సమయంలో రూ.కోటికి రూ.75 లక్షలు ఇస్తామని నమ్మించింది. తొలిసారి నగదు ఇచ్చిన వారికి ముందస్తుగా చెప్పిన విధంగానే నగదు ఇచ్చి నమ్మకం కలిగేలా చేస్తారు. దీంతో అత్యాశకు పోయి ఎవరైనా పెద్ద మొత్తంలో నగదు మార్పిడి కోసం ఇస్తే ఇట్టే మోసగించి నగదుతో ఉడాయిస్తారు. తామిచ్చిన నగదును ఇవ్వాలని కోరితే ఎయిర్‌గన్‌లను చూపి చంపుతామని బెదిరిస్తున్నారు. తాజాగా రూ.2 వేల నోట్లు రద్దు నేపథ్యంలో మోసాలకు తెరలేపారు. రూ.35 లక్షలు ఒరిజినల్ నగదు ఇస్తే రూ.కోటి దొంగనోట్లు ఇస్తామని నమ్మించి పలువురిని మోసగించారన్న ఆరోపణలు ఉన్నాయి. విలాసవంతమైన సుధీర్ ఇల్లు, అతని వ్యవహారశైలి, చుట్టూ మందీ మార్బలం తదితరాలను చూసి ఎందరో మోసపోయారని పోలీసుల దర్యాప్తులో తేలింది. సుధీర్ మోసాల్లో శివకుమార్‌రెడ్డి అలియాస్ మహేంద్రరెడ్డి క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారని విచారణలో వెలుగులోకి వచ్చింది. దేవరకొండ సుధీర్‌పై కావలి, తోటపల్లిగూడూరు, గుడ్లూరు, గుంటూరు, చీరాల ఇలా రాష్ట్రవ్యాప్తంగా 25 కేసులు ఉన్నాయి. నిందితుడిపై 2013లో కావలి రెండో పట్టణ పోలీసులు సస్పెక్టెడ్ షీట్ తెరిచారు.



సుధీర్ ఇంట్లో అధునాతన హంగులతో గది



సుధీర్ ఇంట్లో దొరికిన మారణాయుధాలు, వాకీటాకీలు

డ్రైవర్‌పై దాడి ఘటనతో..

కావలి వద్ద ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి ఘటనతో సుధీర్ గ్యాంగ్‌పై ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. గ్యాంగ్ పలు మోసాలకు పాల్పడినట్లు ఎస్పీ దృష్టికి రావడంతో సుధీర్ బాధితులు నిర్భయంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు. ఎస్పీ ప్రకటనతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బాధితులు ఫిర్యాదులు చేసేందుకు ముందుకు వస్తున్నారు. స్పందన కార్యక్రమంలో సుధీర్ గ్యాంగ్ మోసాలపై విజయవాడకు చెందిన ప్రవీణ్‌కుమార్, గుంటూరుకు చెందిన ప్రీతి స్రుజన, పి.నరసింహులు, విజయలక్ష్మి, ఎ.సుధీర్, భీమవరానికి చెందిన కె.నారాయణదాస్, ఈపూరు వెంకన్నపాళేనికి చెందిన చిన్న అంజేలు, తెలంగాణ రాష్ట్రం జగిత్యాలకు చెందిన రాజేష్ ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డికి ఫిర్యాదులు చేశారు. ఈ మోసాలపై సైతం పోలీసులు లోతుగా విచారణ చేస్తున్నారు.

బాధితులూ.. ఫిర్యాదు చేయండి



ఈజీ మనీ కోసం ప్రజలు మోసగాళ్ల వలలో పడొద్దు. దేవరకొండ సుధీర్ తోపాటు గ్యాంగ్‌లోని ఏడు మందిని ఇప్పటివరకు అరెస్ట్ చేశాం. సుధీర్ గ్యాంగ్ బాధితులు ఎవరైనా ఉంటే నిర్భయంగా ఫిర్యాదు చేయండి. ఈ కేసును క్షేత్రస్థాయిలో మరింత దర్యాప్తు చేస్తున్నాం.

– కె.తిరుమలేశ్వరరెడ్డి, ఎస్పీ

నాయీబ్రాహ్మణులకు అండగా ప్రభుత్వం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలోని నాయీబ్రాహ్మణులకు అండగా నిలుస్తోందని నాయీబ్రాహ్మణ ఎంప్లాయీస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు వేలూరు రంగారావు పేర్కొన్నారు. నగరంలోని నవాబుపేటలో ఉన్న సొసైటీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయీబ్రాహ్మణుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా అనుచిత వ్యాఖ్యలు చేసే వారిపై చర్యలు తీసుకునేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక జీఓను తీసుకురావడం అభినందనీయమన్నారు. చేతివృత్తులు చేస్తున్న నాయీబ్రాహణులకు ఏడాదికి రూ.10 వేలు, అర్హులైన వారికి ఇంటిస్థలం కేటాయించేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు. తొలిసారిగా టీటీడీ పాలకమండలిలో నాయీబ్రాహ్మణ కులానికి చెందిన యానాదయ్యను సభ్యుడిగా నియమించారని తెలిపారు. ముఖ్యమంత్రి తీసుకున్న ఈ నిర్ణయాల పట్ల తాము కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ ఎంప్లాయీస్ సొసైటీ నాయకులు వెంకటేశ్వర్లు, ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి ప్రైమ్ రిజిస్ట్రేషన్లు

నెల్లూరు సిటీ: తమ ఆస్తుల రిజిస్ట్రేషన్లను ప్రజలు సులభ పద్ధతిలో చేసుకునేలా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విధానం కార్డ్ ప్రైమ్. ఈ నెల 14వ తేదీ నుంచి ఈ విధానం జిల్లాలో అమలు కానున్నట్లు జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే పలు జిల్లాల్లో ప్రారంభమైన ఈ విధానం జిల్లాలో కూడా పూర్తిస్థాయిలో ప్రారంభించేందుకు రంగం సిద్ధం చేశారు. ఇప్పటికే జిల్లా రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్‌లకు అధికారికంగా ఉత్తర్వులు అందాయి.

క్లుప్తంగా

ఘనంగా మంత్రి కాకాణి జన్మదిన వేడుకలు



దుప్పట్లు పంపిణీ చేస్తున్న వెంకటశేషయ్య

వెంకటాచలం: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి జన్మదిన వేడుకలను వెంకటాచలంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత వెంకటాచలంలోని ఇందిరమ్మ కాలనీలో చిన్నారులతో కలిసి కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. సరస్వతీనగర్‌లోని బీసీ బాలుర రెసిడెన్షియల్ స్కూల్లో కేక్‌ను కట్ చేసి విద్యార్థులకు క్రీడా సామగ్రిని అందజేశారు. మానసిక దివ్యాంగుల కేంద్రంలో చిన్నారులకు అన్నదానం చేశారు. వెంకటాచలంలోని వడ్డిపాళెంలో స్థానికులతో కలిసి కేక్‌ను కట్ చేయించారు. అనంతరం కసుమూరులోని దర్గా సెంటర్‌లో కేక్‌ను కట్ చేశారు. ఎంపీపీ మందా కవిత, వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు కొణిదెన మోహన్‌నాయుడు, జెడ్పీటీసీ పాట్లూరు సుబ్రహ్మణ్యం, నేతలు మందల పెంచలయ్య, నాటకం శ్రీనివాసులు, షాజహాన్, చీకుర్తి నరసయ్య, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

నిమ్మ ధరలు



పెద్దవి	: రూ. 50
సన్నవి	: రూ. 20
పండ్లు	: రూ. 6

సంక్షేమ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించండి

• ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే ప్రసన్న

కోవూరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగుతోందని, వచ్చే ఎన్నికల్లోనూ ఆయన్ను ఆశీర్వదిస్తే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వేగూరులో రూ.1.3 కోట్లతో చేపట్టిన కామాక్షిదేవి సమేత కైలాసనాథస్వామి ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజను కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డితో కలిసి శుక్రవారం చేపట్టారు. అనంతరం నిర్వహించిన ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమానికి వీరు హాజరయ్యారు. పార్టీ జెండాను ఆవిష్కరించిన అనంతరం ఎంపీ మాట్లాడారు. సంక్షేమ పథకాలతో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి సీఎం కృషి చేస్తున్నారని కొనియాడారు. ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ చేయడాన్ని తన పూర్వజన్మసుకృతంగా భావిస్తున్నానని చెప్పారు. ఆలయ నిర్మాణానికి రూ.86 లక్షల నిధులను ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి దేవదాయ శాఖ నుంచి తీసుకురావడాన్ని అభినందించారు. తొలుత ఎమ్మెల్యేతో కలిసి గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రసన్నకుమార్‌రెడ్డి మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. టీటీడీ సౌజన్యంతో నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో గల 38 ఆలయాలను రూ.3.8 కోట్లతో పునర్నిర్మించనున్నామని వెల్లడించారు. విడవలూరు మండలం అలగానిపాడులో బంగారమ్మ తల్లి దేవస్థానానికి రూ.26.66 లక్షలు, కోవూరు మండలం కొత్తూరులోని కోదండరామస్వామి దేవస్థానానికి రూ.12.34 లక్షలు, బుచ్చిరెడ్డిపాళెం మండలం పెనుబల్లిలోని కోదండరామస్వామి, మహాలక్ష్మి ఆలయాలకు రూ.38.34 లక్షల నిధులను సీజీఎఫ్ ఆధ్వర్యంలో విడుదల చేశారని వెల్లడించారు. డీపీఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, పడుగుపాడు సొసైటీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, ఎంపీపీ పార్వతి, జెడ్పీటీసీ శ్రీలత, మండల కన్వీనర్ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం



వైఎస్సార్సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న రాజగోపాల్‌రెడ్డి

• మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

జలదంకి: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని జలదంకి – 2 సచివాలయ పరిధిలో శుక్రవారం నిర్వహించారు. తొలుత సంక్షేమ పథకాల వివరాలతో కూడిన బోర్డును గ్రామ సచివాలయంలో ఆవిష్కరించారు. అనంతరం నేతలు, కార్యకర్తలతో కలిసి ర్యాలీగా వచ్చి స్థానిక ఎస్సీ కాలనీ బస్టాండ్ సెంటర్‌లో పార్టీ జెండాను ఆవిష్కరించి కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా రాజగోపాల్‌రెడ్డి మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్ల పాలన.. గత చంద్రబాబు పాలనకు మధ్య వ్యత్యాసాన్ని ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. హామీల్లో 99 శాతం మేర నెరవేర్చిన ఘనత సీఎంకే దక్కుతుందని, ఆయన్ను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. టీడీపీ, జనసేన ఎన్ని కుట్రలు పన్నినా నమ్మే స్థితిలో ప్రజలు లేరని స్పష్టం చేశారు. పార్టీ నేతలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన మేలును వివరించారు. గత, ప్రస్తుత పాలనను అర్థమయ్యేలా చెప్పి వారి మద్దతుతో స్టాంప్ వేయించారు. అనంతరం సంక్షేమ పథకాల బుక్‌లెట్లను అందజేశారు. పార్టీ మండల కన్వీనర్ పాలవల్లి మాలకొండారెడ్డి, సొసైటీ చైర్మన్ కేతిరెడ్డి రవీంద్రరెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ తిప్పారెడ్డి ఇందిరమ్మ, జెడ్పీటీసీ మేదరమెట్ల శివలీల, నేతలు ఇస్కా మదన్‌మోహన్‌రెడ్డి, కొర్శిపాటి రామిరెడ్డి, సురె వెంకటశేషారెడ్డి, సర్పంచ్ అనూరాధ, తమ్మినేని సతీష్, దామెర్ల దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ అవయవాల ఎంపికకు 14న శిబిరం

నెల్లూరు (వేదాయపాళెం): జిల్లాలో కృత్రిమ అవయవాలు అవసరమైన వారి ఎంపికకు సంబంధించిన శిబిరాన్ని నెల్లూరు వనంతోపులోని జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ కార్యాలయంలో ఈ నెల 14న నిర్వహించనున్నామని దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకుడు అక్బర్ అలీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కృత్రిమ అవయవాలు అవసరమైన వారి నుంచి కొలతలను సేకరించనున్నామని చెప్పారు. అవసరమైన వారు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో ఆ రోజున ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల్లోపు హాజరుకావాలని కోరారు. వీటితో పాటు సదరమ్ మెడికల్ సర్టిఫికెట్లు, రేషన్, ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలను తీసుకురావాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉత్సాహంగా నెట్‌బాల్ పోటీలు



ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో రాష్ట్ర స్థాయి ఎస్జీఎఫ్ నెట్‌బాల్ అండర్ – 17 పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఉమ్మడి 13 జిల్లాలకు చెందిన జట్లు హాజరయ్యాయి. బాలుర విభాగంలో క్వార్టర్స్ ఫైనల్స్‌కు పలు జట్లు చేరాయి. అనంతపురం జట్టు కృష్ణా జిల్లా జట్టుపై 11 – 02, పశ్చిమ గోదావరి జట్టు తూర్పు గోదావరిపై 15 – 10, నెల్లూరు జిల్లా జట్టు కడప జట్టుపై 11 – 09, విశాఖపట్నం జట్టు ప్రకాశం జట్టుపై 11 – 05 గోల్స్ తేడాతో విజయం సాధించాయి.

• బాలికల నాకౌట్ ఫలితాల్లో నెల్లూరు జట్టు కడప జిల్లా జట్టుపై 11 – 10 గోల్స్ తేడాతో నెగ్గింది. పశ్చిమ గోదావరి జట్టు శ్రీకాకుళం జట్టుపై 15 – 07, విశాఖపట్నం జట్టు అనంతపురం జిల్లా జట్టుపై 07 – 05, తూర్పు గోదావరి జిల్లా జట్టు ప్రకాశం జట్టుపై 07 – 06 తేడాతో విజయం సాధించాయి.

రౌడీమూకల ఆగడాలను అరికట్టగలిగాం



మాట్లాడుతున్న రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

• ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: ఆర్టీసీ డ్రైవర్‌పై కావలిలో రౌడీమూకలు సాగించిన దాష్టీకంలో తమపై నిందలు మోపి రాజకీయంగా లబ్ధి పొందాలని టీడీపీ నేతలు యత్నించారని, కారకులను చట్టం ముందు పోలీసులు నిలబెట్టడం ద్వారా వారి ఆగడాలను అరికట్టగలిగామని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. రౌడీ మూకలను తామెప్పుడూ చేరదీయలేదని, ఇలాంటి సంస్కృతికి తాము పూర్తిగా వ్యతిరేకమని చెప్పారు. రౌడీమూకలు తమ పార్టీకి చెందిన వారంటూ నారా లోకేశ్ వ్యాఖ్యానించారని, నిజానిజాలు తెలుసుకోకుండా నోరుపారేసుకున్నారని మండిపడ్డారు. రౌడీమూకలను పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపారని.. కావలిలో మరోసారి రౌడీయిజం చేయాలంటేనే భయపడే స్థితికి తీసుకొచ్చామన్నారు. చెడు చేసే వారిపై చర్యలు చేపట్టడంలో పార్టీలు నిజాయతీగా వ్యవహరించాలే గానీ వాటిని అడ్డం పెట్టుకొని రాజకీయంగా లబ్ధి పొందాలని భావించడం తగదని హితవు పలికారు. కావలిలో ప్రశాంతతకు భగ్నం కలిగించే వారిపై కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

‘పది’ పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

నెల్లూరు (టౌన్): పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన ఫీజు గడువును ఈ నెల 20 వరకు పొడిగించారని డీఈఓ గంగాభవాని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులు రూ.125, ప్రైవేట్ విద్యార్థులు మూడు సబ్జెక్టులకు రూ.110, ఆపై రూ.125 చెల్లించాలని కోరారు. ఒకేషనల్ విద్యార్థులు అదనంగా రూ.60ను చెల్లించాలని సూచించారు.

పెయింటర్ అనుమానాస్పద మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నెల్లూరు(క్రైమ్): లాడ్జిలోని బాత్‌రూమ్‌లో పెయింటర్ అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన అయ్యప్పగుడి సమీపంలోని రవి హోటల్ కమ్ లాడ్జిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. చెన్నైకు చెందిన తులసి (60) నగరంలో పెయింట్ పనులు చేసుకుంటున్నారు. లాడ్జిలో మూడు నెలలుగా ఉంటూ రోజూ రాత్రి రూ.80 చెల్లించి నిద్రిస్తున్నారు. ఈ క్రమంలో మూడో ఫ్లోర్లోని కామన్ బెడ్స్‌లో గురువారం రాత్రి నిద్రించారు. ఈ తరుణంలో బాత్ రూమ్‌లో మృతి చెంది ఉండటాన్ని గమనించిన సిబ్బంది హోటల్ యజమాని శేషయ్యకు తెలియజేశారు. స్థానిక వీఆర్వో ప్రసాద్‌కు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి వేదాయపాళెం పోలీసులకు వీఆర్వో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. మృతుడి వివరాలు తెలిసిన వారు తమను సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ నారాయణ కోరారు.

స్కూల్ బస్సును ఢీకొన్న కారు

• ఇద్దరికి తీవ్ర గాయాలు



108లో క్షతగాత్రుల తరలింపు

సంగం: స్కూల్ బస్సును కారు ఢీకొనడంతో ఇద్దరు గాయపడిన ఘటన మండలంలోని కోలగట్ల వద్ద నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలు.. ఏఎస్‌పేట నుంచి విద్యార్థులను కోలగట్లలో వదిలేందుకు వస్తున్న ప్రైవేట్ బస్సు గ్రామంలోకి వెళ్లేందుకు కుడివైపునకు తిరగసాగింది. ఈ క్రమంలో ఆత్మకూరు వైపు నుంచి వస్తున్న కారు ఢీకొని పక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లింది. దీంతో కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. కారు డ్రైవర్ సిసింద్రీ, మరో వ్యక్తి సుధీర్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108లో ఆత్మకూరు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ ఓబీసీ మోర్చా కార్యవర్గ ఎన్నిక

నెల్లూరు(మినీబైపాస్): బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా కార్యవర్గాన్ని నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఎన్నుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను పార్టీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు యాకసిరి ఫణి ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా మల్లేశ్వరరావు, జయచంద్ర, తిరకాల శివ, మహిమలూరి శ్రీనివాసులు, రాపూరు ప్రసాద్, రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా లింగాల రామకృష్ణ, కార్యదర్శులుగా లక్ష్మయ్య, కృష్ణ, విజయకుమార్ తదితరులను ఎన్నుకున్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరమ్మ, కర్నాటి ఆంజనేయరెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొగరాల సురేష్ పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్	: రూ.117
లేయర్	: రూ.105
బ్రాయిలర్ చికెన్	: రూ.210
స్కిన్‌లెస్ చికెన్	: రూ.230
లేయర్ చికెన్	: రూ.178



సౌత్‌జోన్ జట్టులో త్రిష

సీనియర్ మహిళల ఇంటర్ జోనల్ టి20 క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనే సౌత్‌జోన్ జట్టును ప్రకటించారు. 15 మంది సభ్యులతో కూడిన ఈ జట్టులో హైదరాబాద్ నుంచి గొంగడి త్రిష, భోగి శ్రావణి... ఆంధ్ర నుంచి బారెడ్డి అనూష, ఎస్.అనూష, నీరగట్టు అనూష ఎంపికయ్యారు. ఈ టోర్నీ ఈనెల 24 నుంచి డిసెంబర్ 4 వరకు లక్నోలో జరుగుతుంది. హైదరాబాద్‌కు చెందిన 17 ఏళ్ల త్రిష ఈ ఏడాది అండర్-19 మహిళల ప్రపంచకప్ సాధించిన భారత జట్టులో సభ్యురాలిగా ఉంది.



సెమీఫైనల్లో సుమిత్

హెల్సింకి ఓపెన్ ఏటీపీ చాలెంజర్-125 టెన్నిస్ టోర్నీలో భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్ సెమీఫైనల్లోకి ప్రవేశించాడు. ప్రపంచ 69వ ర్యాంకర్ ఎమిల్ రుసువోరి (ఫిన్‌లాండ్)తో శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 169వ ర్యాంకర్ సుమిత్ తొలి సెట్‌ను 6-3తో గెలిచి, రెండో సెట్‌లో 3-1తో ఆధిక్యంలోకి వెళ్లాడు. ఈ దశలో ఎమిల్ గాయం కారణంగా వైదొలగడంతో సుమిత్‌ను విజేతగా ప్రకటించారు. నేడు జరిగే సెమీఫైనల్లో ఇటలీ ప్లేయర్ స్టెఫానో ట్రావాగ్లియాతో సుమిత్ ఆడతాడు.

ఇరుగు దిష్టి... పొరుగు దిష్టి...

రచిన్‌కు దిష్టి తీసిన అమ్మమ్మ



సాక్షి, బెంగళూరు: వన్డే ప్రపంచకప్‌లో సంచలన ప్రదర్శన కనబరుస్తున్న న్యూజిలాండ్ క్రికెటర్ రచిన్ రవీంద్ర భారత సంతతికి చెందిన వాడని తెలిసిందే. రచిన్ కన్నడిగుడు. ఇప్పటికీ అతని మూలాలు బెంగళూరుతో ముడిపడే ఉన్నాయి. అందుకే శ్రీలంకతో మ్యాచ్ ముగియగానే రచిన్ అమ్మమ్మ ఇంటికి వెళ్లాడు. తన మనవడు పుట్టింది విదేశంలో అయినా స్వదేశీ అలవాట్లు, సంప్రదాయాలు బాగా తెలిసిన పెద్దావిడ (అమ్మమ్మ) తన ఇంటికి రాగానే రచిన్‌ను సోఫాలో కూర్చోబెట్టి దిష్టి తీసింది. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట తెగ వైరలవుతోంది. కివీస్‌లో స్థిరపడిన రచిన్ తల్లిదండ్రులు దీప, రవి కృష్ణమూర్తి బెంగళూరు వాసులు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అయిన రవి వృత్తిరీత్యా 1990లో కివీస్‌కు వలస వెళ్లగా... 1999లో వెల్లింగ్టన్‌లో రచిన్ జన్మించాడు. రవి కృష్ణమూర్తికి క్రికెట్ అంటే ఇష్టం. భారత దిగ్గజాలు సచిన్ టెండూల్కర్, రాహుల్ ద్రవిడ్‌లంటే అభిమానం. అందువల్లే తన కుమారుడికి వారిద్దరి పేర్లు కలిపి పెట్టారు. తనకిష్టమైన క్రికెట్‌లో బ్యాటర్‌ను చేశాడు.

రచిన్‌కు ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' అవార్డు



దుబాయ్: రచిన్ రవీంద్ర ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' అవార్డుకు ఎంపికయ్యాడు. ప్రస్తుత వరల్డ్‌కప్‌లో రచిన్ అత్యధిక పరుగులు (565) చేసిన రెండో బ్యాటర్‌గా కొనసాగుతున్నాడు. లీగ్ దశలో మొత్తం 9 మ్యాచ్‌లాడిన ఈ కివీస్ ఓపెనర్ 3 శతకాలు, 2 అర్ధసెంచరీలు సాధించాడు. న్యూజిలాండ్ సెమీస్ చేరడంలో కీలక భూమిక పోషించాడు. ఈ నిలకడైన ప్రదర్శనే అతనికి ఐసీసీ అవార్డుకు ఎంపిక చేసింది. రేసులో ప్రపంచకప్‌లో అత్యధిక పరుగులు చేసిన దక్షిణాఫ్రికా ఓపెనర్ డికాక్ (591), భారత సీమర్ బుమ్రా (15 వికెట్లు) ఉన్నప్పటికీ అవార్డు మాత్రం రచిన్‌నే వరించింది. 2021 జనవరి నుంచి ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' అవార్డులు ఇస్తోంది. రచిన్‌కంటే ముందు న్యూజిలాండ్ నుంచి డెవాన్ కాన్వే (2021-జూన్), ఎజాజ్ పటేల్ (2021-డిసెంబర్) ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' అవార్డులు గెల్చుకున్నారు.

దర్జాగా దక్షిణాఫ్రికా గెలుపు

- ఐదు వికెట్ల తేడాతో సఫారీ విక్టరీ
- రాణించిన కొయెట్జీ, డసెన్
- ప్రపంచకప్‌ను ఓటమితో ముగించిన అఫ్గానిస్తాన్
- అజ్మతుల్లా పోరాటం వృథా


డసెన్

అహ్మదాబాద్: ఈ వన్డే వరల్డ్‌కప్‌లో అందరినీ ఆకట్టుకున్న అఫ్గానిస్తాన్ పోరాటం చివరకు పరాజయంతో ముగిసింది. ఇది వరకే సెమీఫైనల్ చేరిన దక్షిణాఫ్రికా ఆఖరి లీగ్ మ్యాచ్‌లో అఫ్గానిస్తాన్‌పై ఐదు వికెట్ల తేడాతో గెలిచి ఈనెల 16న కోల్‌కతాలో ఆస్ట్రేలియాతో జరిగే రెండో సెమీఫైనల్ పోరులో పూర్తి విశ్వాసంతో బరిలోకి దిగనుంది. నిర్ణీత తొమ్మిది లీగ్ మ్యాచ్‌లను పూర్తి చేసుకున్న దక్షిణాఫ్రికా ఏడో విజయంతో 14 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. అసాధ్యమైన సమీకరణంతో సెమీఫైనల్ ఆశలు వదులుకున్న అఫ్గానిస్తాన్ ఈ మెగా ఈవెంట్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌తోపాటు మాజీ విశ్వవిజేతలు పాకిస్తాన్, శ్రీలంకలను ఓడించామన్న సంతృప్తితో స్వదేశానికి వెళ్లనుంది. నరేంద్ర మోదీ స్టేడియంలో శుక్రవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అఫ్గానిస్తాన్ 50 ఓవర్లలో 244 పరుగుల వద్ద ఆలౌటైంది. అజ్మతుల్లా ఒమర్జాయ్ (107 బంతుల్లో 97 నాటౌట్; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు) ఒంటరి పోరాటం చేసి సెంచరీకి మూడు పరుగుల దూరంలో నిలిచాడు. దక్షిణాఫ్రికా బౌలర్లలో గెరాల్డ్ కొయెట్జీ 4, ఎన్‌గిడి, కేశవ్ మహరాజ్ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం సునాయాస లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా 47.3 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 247 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' వాన్‌డర్ డసెన్ (95 బంతుల్లో 76 నాటౌట్; 6 ఫోర్లు, 1 సిక్స్) అజేయంగా నిలిచి గెలిపించాడు. అఫ్గాన్ బౌలర్లలో రషీద్ ఖాన్, మొహమ్మద్ నబీ చెరో 2 వికెట్లు తీశారు.

ఒమర్జాయ్ ఒంటరిగా...

ఓపెనర్లు ఇబ్రహీమ్ జద్రాన్ (15), రహ్మనుల్లా గుర్బాజ్ (22 బంతుల్లో 25; 3 ఫోర్లు, 1 సిక్స్) పెద్దగా రాణించలేదు. కెప్టెన్ హష్మతుల్లా (2) కూడా నిరాశపరచడంతో 45 పరుగులకే 3 వికెట్లను కోల్పోయిన అఫ్గాన్‌ను మిడిలార్డర్ బ్యాటర్ అజ్మతుల్లా ఒమర్జాయ్ ఆదుకున్నాడు. 71 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. అవతలివైపు రహ్మత్ షా (46 బంతుల్లో 26; 2 ఫోర్లు), ఇక్రామ్ (12), రషీద్ ఖాన్ (14), నూర్ అహ్మద్ (32 బంతుల్లో 26; 4 ఫోర్లు) ఇలా ఏ ఒక్కరు బాధ్యతగా క్రీజులో నిలువలేకపోయినా... అజ్మతుల్లా మాత్రం కడదాకా నిలబడి ఒంటరి పోరాటం చేశాడు. శతకానికి 3 పరుగుల దూరంలో అజేయంగా నిలిచాడు. అతని పోరాటం వల్లే అఫ్గాన్ ఆ మాత్రం స్కోరు చేసింది.


ఒమర్జాయ్

స్కోరు వివరాలు

అఫ్గానిస్తాన్ ఇన్నింగ్స్: గుర్బాజ్ (సి) క్లాసెన్ (బి) కేశవ్ 25; జద్రాన్ (సి) డికాక్ (బి) కొయెట్జీ 15; రహ్మత్ షా (సి) మిల్లర్ (బి) ఎన్‌గిడి 26; హష్మతుల్లా (సి) డికాక్ (బి) కేశవ్ 2; అజ్మతుల్లా ఒమర్జాయ్ (నాటౌట్) 97; ఇక్రామ్ (సి) డికాక్ (బి) కొయెట్జీ 12; నబీ (సి) డికాక్ (బి) ఎన్‌గిడి 2; రషీద్ ఖాన్ (సి) డికాక్ (బి) ఫెలుక్‌వాయో 14; నూర్ అహ్మద్ (సి) డికాక్ (బి) కొయెట్జీ 26; ముజీబ్ (సి) మార్క్‌రమ్ (బి) కొయెట్జీ 8; నవీనుల్ (రనౌట్) 2; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (50 ఓవర్లలో ఆలౌట్) 244. వికెట్ల పతనం:** 1-41, 2-41, 3-45, 4-94, 5-112, 6-116, 7-160, 8-204, 9-226, 10-244. **బౌలింగ్:** రబడ 10-0-40-0, ఎన్‌గిడి 8.3-0-69-2, మార్క్‌రమ్ 4.3-0-25-0, కొయెట్జీ 10-1-44-4, కేశవ్ మహరాజ్ 10-1-25-2, ఫెలుక్‌వాయో 7-0-36-1.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: డికాక్ (ఎల్బీడబ్ల్యూ) (బి) నబీ 41; బవుమా (సి) గుర్బాజ్ (బి) ముజీబ్ 23; డసెన్ (నాటౌట్) 76; మార్క్‌రమ్ (సి) నవీనుల్ (బి) రషీద్ 25; క్లాసెన్ (బి) రషీద్ ఖాన్ 10; మిల్లర్ (సి అండ్ బి) నబీ 24; ఫెలుక్‌వాయో (నాటౌట్) 39; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (47.3 ఓవర్లలో 5 వికెట్లకు) 247. వికెట్ల పతనం:** 1-64, 2-66, 3-116, 4-139, 5-182. **బౌలింగ్:** ముజీబ్ 10-0-51-1, నవీనుల్ 6.3-0-52-0, నబీ 10-1-35-2, ఒమర్జాయ్ 1-0-8-0, రషీద్ ఖాన్ 10-1-37-2, నూర్ అహ్మద్ 9-0-49-0, రహ్మత్ షా 1-0-12-0.

ఆదుకున్న డసెన్

సునాయాస లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఓపెనర్లు డికాక్ (47 బంతుల్లో 41; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), కెప్టెన్ బవుమా (28 బంతుల్లో 23; 3 ఫోర్లు) తొలి వికెట్‌కు 64 పరుగులు జోడించి మంచి ఆరంభమే ఇచ్చారు. అయితే మార్క్‌రమ్ (32 బంతుల్లో 25; 1 ఫోర్, 1 సిక్స్), క్లాసెన్ (10) లాంటి కీలక బ్యాటర్లు విఫలమవడంతో 139 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో వన్‌డౌన్‌లో బ్యాటింగ్‌కు దిగిన డసెన్... మిల్లర్ (33 బంతుల్లో 24; 1 ఫోర్, 1 సిక్స్)తో కలిసి పరిస్థితి చక్కదిద్దాడు. తర్వాత ఫెలుక్‌వాయో (37 బంతుల్లో 39 నాటౌట్; 1 ఫోర్, 3 సిక్సర్లు) ధాటిగా ఆడటంతో దక్షిణాఫ్రికా సంచలనానికి తావివ్వకుండా గెలిచింది. అబేధ్యమైన ఆరో వికెట్‌కు డసెన్, ఫెలుక్‌వాయో 65 పరుగులు జోడించారు.

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	8	8	0	16	2.456
దక్షిణాఫ్రికా	9	7	2	14	1.261
ఆస్ట్రేలియా	8	6	2	12	0.861
న్యూజిలాండ్	9	5	4	10	0.743
పాకిస్తాన్	8	4	4	8	0.036
అఫ్గానిస్తాన్	9	4	5	8	-0.336
ఇంగ్లండ్	8	2	6	4	-0.885
బంగ్లాదేశ్	8	2	6	4	-1.142
శ్రీలంక	9	2	7	4	-1.419
నెదర్లాండ్స్	8	2	6	4	-1.635

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే.-నెట్ రన్‌రేట్

ప్రపంచకప్‌లో నేడు

ఆస్ట్రేలియా × బంగ్లాదేశ్
వేదిక: పుణే
ఉదయం గం. 10:30 నుంచి

ఇంగ్లండ్ × పాకిస్తాన్
వేదిక: కోల్‌కతా

మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

రన్నరప్ నైశిక్ రెడ్డి జోడీ



సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య జూనియర్ సర్క్యూట్ టోర్నీలో తెలంగాణకు చెందిన గనగామ నైశిక్ రెడ్డి రన్నరప్‌గా నిలిచాడు. ఢాకాలో జరిగిన ఈ టోర్నీలో నైశిక్ రెడ్డి-ప్రబీర్ ముకేశ్ చావ్డా (భారత్) ద్వయం బాలుర డబుల్స్ విభాగం ఫైనల్లో ఓటమి చవిచూసింది. తుది పోరులో నైశిక్-ప్రబీర్ జోడీ 2-6, 3-6తో భారత్‌కే చెందిన తవీశ్ పావా-అర్ణవ్ యాదవ్ జంట చేతిలో ఓటమి పాలైంది.

సెమీస్‌లో అభయ్ నిష్క్రమణ



న్యూఢిల్లీ: నియోస్ వెనిస్ వెర్టె ఓపెన్ స్క్వాష్ టోర్నీలో భారత ప్లేయర్ అభయ్ సింగ్ సెమీఫైనల్లో నిష్క్రమించాడు. ఫ్రాన్స్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో శుక్రవారం రెండో సీడ్ రోరీ స్టీవర్ట్ (స్కాట్లాండ్)తో జరగాల్సిన సెమీఫైనల్లో అభయ్ గాయం కారణంగా బరిలోకి దిగకుండా తన ప్రత్యర్థికి వాకోవర్ ఇచ్చాడు. క్వార్టర్ ఫైనల్లో అభయ్ 11-1, 7-11, 19-17, 8-11, 11-6తో ఆరో సీడ్ విక్టర్ బైర్టస్ (చెక్ రిపబ్లిక్)పై గెలిచాడు.

శ్రీలంక క్రికెట్ బోర్డు సస్పెండ్

ఐసీసీ నిర్ణయం

దుబాయ్: శ్రీలంక క్రికెట్ బోర్డు వ్యవహారాల్లో ప్రభుత్వ జోక్యంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) కఠిన నిర్ణయం తీసుకుంది. శ్రీలంక క్రికెట్ బోర్డు సభ్యత్వాన్ని సస్పెండ్ చేస్తున్నట్లు... ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని శుక్రవారం ఐసీసీ ప్రకటించింది. ఈనెల 21న ఐసీసీ బోర్డు సమావేశం జరుగుతుందని, ఆ తర్వాతే శ్రీలంక బోర్డు భవిష్యత్ కార్యాచరణపై స్పష్టత వస్తుందని ఐసీసీ తెలిపింది. భారత్‌లో జరుగుతున్న వన్డే ప్రపంచకప్‌లో శ్రీలంక నిరాశాజనక ప్రదర్శన చేసింది. ఆడిన తొమ్మిది మ్యాచ్‌ల్లో కేవలం రెండింటిలో మాత్రమే గెలిచింది. దాంతో శ్రీలంక జట్టు ఆటతీరుపై ఆ దేశ ప్రభుత్వ క్రీడా మంత్రి రోషన్ రణసింఘే ఆగ్రహం వ్యక్తం చేస్తూ శ్రీలంక క్రికెట్ బోర్డును రద్దు చేశారు. మాజీ కెప్టెన్ అర్జున రణతుంగ నేతృత్వంలో ఏడుగురు సభ్యులతో కూడిన తాత్కాలిక కమిటీని నియమించారు. అయితే ఈ నిర్ణయంపై బోర్డు కోర్టుకు వెళ్లింది. ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబట్టిన కోర్టు క్రికెట్ బోర్డును పునర్నియమించింది. జింబాబ్వే (2021) తర్వాత ఐసీసీ ద్వారా సస్పెన్షన్‌కు గురైన రెండో పూర్తిస్థాయి సభ్యత్వ దేశం శ్రీలంక కావడం గమనార్హం.

సినిమా

సూపర్ స్టార్ కృష్ణ విగ్రహావిష్కరణ


● బెల్లం దుర్గ, దేవినేని అవినాష్, ఘట్టమనేని బాబీ, కమల్‌హాసన్

సూపర్‌స్టార్ కృష్ణ విగ్రహాన్ని ప్రముఖ నటుడు కమల్‌హాసన్ ఆవిష్కరించారు. విజయవాడలోని గురునానక్ కాలనీ కేడీజీఓ పార్కులో కృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. 'భారతీయుడు 2' చిత్రం షూటింగ్ కోసం విజయవాడలో ఉన్న కమల్‌హాసన్.. కృష్ణ-మహేశ్‌బాబు ఫ్యాన్స్ ఆహ్వానం మేరకు కృష్ణ విగ్రహాన్ని ఆవిష్కరించారు. "కృష్ణగారి విగ్రహావిష్కరణలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉంది" అన్నారు కమల్‌హాసన్. ఈ విగ్రహావిష్కరణలో పాల్గొన్న విజయవాడ తూర్పు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్ మాట్లాడుతూ– "కళామతల్లికి తనదైన శైలిలో సేవలందించి, ప్రేక్షకుల మనసులో సుస్థిర స్థానాన్ని ఏర్పరచుకున్నారు కృష్ణగారు. తండ్రి గౌరవాన్ని మహేశ్‌బాబుగారు నిలబెడుతున్నారు" అన్నారు. "కృష్ణగారి విగ్రహావిష్కరణ కేవలం పదిరోజుల వ్యవధిలో పూర్తి చేసేందుకు సహకరించిన సీఎం జగన్ మోహన్ రెడ్డిగారికి కృతజ్ఞతలు" అని కృష్ణ అభిమానుల సంఘం పేర్కొంది. ఈ కార్యక్రమంలో విజయవాడ డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కృష్ణ కుటుంబ సభ్యుడు ఘట్టమనేని బాబీ, వైఎస్సార్‌సీపీ నాయకులు గల్లా పద్మావతి, రాజ్‌కమల్ పాల్గొన్నారు.

గర్వంగా ఉంది: హీరో మహేశ్‌బాబు

"నాన్నగారి విగ్రహాన్ని ఆవిష్కరించిన కమల్ హాసన్‌గారికి కృతజ్ఞతలు. నాన్నగారు వదిలి వెళ్లిన జ్ఞాపకాలు, వారసత్వానికి ఇదొక నివాళి. నాన్న విగ్రహం ఏర్పాటుకు కారణమైన అందరికీ, ఈ వేడుక ఘనంగా నిర్వహించిన అభిమానులకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు" అంటూ ట్వీట్ చేశారు మహేశ్ బాబు.


● కాజల్

వేటాడే సత్యభామ

'సత్యా.. ఈ కేసు నీ చేతుల్లో లేదు (ప్రకాశ్‌రాజ్).. కానీ ఆ ప్రాణం నా చేతుల్లోనే పోయింది సార్ (కాజల్ అగర్వాల్)' అనే డైలాగ్స్‌తో మొదలవుతుంది 'సత్యభామ' టీజర్. పోలీసాఫీసర్ సత్యభామ పాత్రలో కాజల్ అగర్వాల్ నటిస్తున్న చిత్రం ఇది. ప్రకాశ్‌రాజ్, నవీన్ చంద్ర కీలక పాత్రధారులు. బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపెల్లి నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి దర్శకుడు శశికిరణ్ తిక్క సమర్పకులుగా వ్యవహరిస్తూ స్క్రీన్‌ప్లే అందించారు. శుక్రవారం 'సత్యభామ' టీజర్‌ను రిలీజ్ చేశారు. 'సార్.. ఆ గిల్ట్ నన్ను వెంటాడుతూనే ఉంది. వేటాడాలి (కాజల్ అగర్వాల్)', 'ఆ అమ్మాయి చావుకు మీరే కారణం అంటున్నారు. ఈ కేసును మీరు వదిలేసినట్లేనా? (విలేకర్లు).. నెవర్ (కాజల్)' అనే డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. ఈ చిత్రానికి సంగీతం: శ్రీచరణ్ పాకాల.

ఇళయరాజా బయోపిక్‌లో ధనుష్


● ధనుష్, ఇళయరాజా

సంగీత జ్ఞాని ఇళయరాజా జీవితం వెండితెరపైకి రానుంది. ఇందులో ధనుష్ ఓ ప్రధాన పాత్రలో నటించనున్నారు. మెర్క్యూరీ గ్రూప్, కనెక్ట్ మీడియా సంస్థలు ఈ బయోపిక్‌ను నిర్మించనున్నాయి. వచ్చే ఏడాది అక్టోబరులో ఈ చిత్రం షూటింగ్ ప్రారంభించి, 2025 ఏడాది మధ్యలో రిలీజ్ చేయాలనుకుంటున్నారు. ఈ సందర్భంగా మెర్క్యూరీ గ్రూప్ సీఈవో, ఎండీ శ్రీరామ్ భక్తి శరణ్ మాట్లాడుతూ –"ప్రాంతీయ కథలతో సినిమాలు తీస్తే అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తోంది. అందుకే లోకల్, ప్రాంతీయ కథలను అంతర్జాతీయ స్థాయిలో తెరకెక్కించాలనుకుంటున్నాం" అన్నారు. "రాబోయే రెండు దశాబ్దాల్లో భారతీయ వినోద పరిశ్రమ మరింత అభివృద్ధి చెందుతుంది. ప్రపంచ వినోద పరిశ్రమలో ప్రసిద్ధి చెందిన మెర్క్యూరీ సంస్థతో మెగా బడ్జెట్ సినిమాలను నిర్మించడానికి వారితో చేతులు కలపడం మాకు సంతోషంగా ఉంది" అని కనెక్ట్ మీడియా ప్రతినిధి వరుణ్ మాథుర్ అన్నారు.

కొత్తవాళ్లతో సినిమా పెద్ద బాధ్యత - నిహారిక


● యూనిట్‌కి స్క్రిప్ట్ అందిస్తున్న అల్లు అరవింద్

"మా పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్‌లో ఇప్పటివరకు వెబ్ సిరీస్‌లు, షార్ట్ ఫిలిమ్స్ చేశాం. తొలిసారి ఫీచర్ ఫిల్మ్ ప్రారంభించాం. ఇంతమంది కొత్తవాళ్లతో సినిమా చేయటం పెద్ద బాధ్యతగా భావిస్తున్నాను" అన్నారు నిహారిక కొణిదెల. యదు వంశీ దర్శకత్వంలో నిహారిక కొణిదెల సమర్పణలో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ ఎల్ఎల్‌పీ, శ్రీ రాధా దామోదర్ స్టూడియోస్‌పై పద్మజ కొణిదెల, జయలక్ష్మి అడపాక నిర్మిస్తున్న చిత్రం శుక్రవారం ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి నటుడు నాగబాబు కెమెరా స్విచ్చాన్ చేయగా, హీరో వరుణ్ తేజ్ క్లాప్ కొట్టారు. డైరెక్టర్ వెంకీ కుడుముల గౌరవ దర్శకత్వం వహించగా, నిర్మాత అల్లు అరవింద్ స్క్రిప్ట్‌ని యూనిట్‌కి అందించారు. యదు వంశీ మాట్లాడుతూ– "ఈ సినిమా ద్వారా 11 మందిని హీరోలుగా, నలుగురిని హీరోయిన్లుగా పరిచయం చేస్తున్నాం" అన్నారు. "ఈ చిత్రంతో నేను, నా సతీమణి జయలక్ష్మి నిర్మాతలుగా పరిచయమవుతున్నాం" అన్నారు శ్రీరాధా దామోదర్ స్టూడియోస్ అధినేత ఫణి. ఈ చిత్రానికి కెమెరా: రాజు ఎడురోలు, సంగీతం: అనుదీప్ దేవ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మన్యం రమేశ్.

లింగి లింగిడి..!


● రాహుల్, శివానీ, మిధున్, తేజా మార్ని, 'బన్నీ' వాసు, విద్య

శ్రీకాంత్ మేక, రాహుల్ విజయ్, శివానీ రాజశేఖర్, వరలక్ష్మీ శరత్‌కుమార్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'కోట బొమ్మాళి పీఎస్'. తేజా మార్ని దర్శకత్వంలో 'బన్నీ' వాసు, విద్యా కొప్పినీడి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 24న విడుదల అవుతోంది. రంజిన్ రాజ్, మిధున్ ముకుందన్ స్వరపరచిన ఈ చిత్రంలోని 'లింగి లింగిడి..' అంటూ సాగే పాటను ఇటీవల విడుదల చేయగా, 30 మిలియన్ వ్యూస్‌ను పూర్తి చేసుకుంది. "ఈ పాటలానే మా చిత్రానికి ప్రేక్షకులు విజయం అందిస్తారనే నమ్మకం ఉంది" అని హైదరాబాద్‌లో నిర్వహించిన సెలబ్రేషన్స్‌లో 'బన్నీ' వాసు అన్నారు.


● జాన్వీ కపూర్

రెండు హృదయాల కల

'రూహి' చిత్రం తర్వాత రాజ్ కుమార్ రావు, జాన్వీ కపూర్ ప్రధాన పాత్రల్లో నటించిన తాజా చిత్రం 'మిస్టర్ అండ్ మిసెస్ మహి'. 'నో డ్రీమ్ ఈజ్ ఎవర్ చేజ్డ్ ఎలోన్!' అనేది క్యాప్షన్. క్రికెట్ నేపథ్యంలో రూపొందిన ఈ స్పోర్ట్స్ డ్రామా ఫిల్మ్‌కు శరణ్‌శర్మ దర్శకత్వం వహించగా, కరణ్ జోహార్ నిర్మించారు. "ఒకే కల కోసం రెండు హృదయాలు ఎదురు చూస్తున్నాయి" అంటూ ఈ మూవీని ఏప్రిల్ 19న రిలీజ్ చేయనున్నట్లుగా జాన్వీ కపూర్ అండ్ టీమ్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు.

మాస్ రింగు...


● సోహైల్

'బిగ్ బాస్' ఫేమ్ సోహైల్ హీరోగా నటించిన తాజా చిత్రం 'బూట్‌కట్ బాలరాజు'. శ్రీ కోనేటి దర్శకత్వంలో గ్లోబల్ ఫిలిమ్స్– కథ వేరుంటాది బ్యానర్స్‌పై ఎండీ పాషా నిర్మిస్తున్నారు. మేఘా లేఖ, సునీల్, సిరి హన్మంత్, ఇంద్రజ కీలక పాత్రలు పోషిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'రింగు రింగు బిళ్ల..' అంటూ సాగే టైటిల్ సాంగ్‌ను విడుదల చేశారు. ఈ పాటకి దేవ్ పవార్ సాహిత్యం అందించగా, భోలే షావలి, రఘు రామ్ పాడారు. ప్రేమ్ రక్షిత్ మాస్టర్ కొరియోగ్రఫీ అందించారు. "ఫుల్ మాస్‌గా 'రింగు రింగు బిళ్ల..' సాంగ్ ఉంటుంది. సోహైల్ చేసిన మాస్ డ్యాన్స్ మూమెంట్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి" అన్నారు మేకర్స్.

సరికొత్త ట్రయల్


● 'ది ట్రయల్' పోస్టర్

స్పందన పల్లి, యుగ్ రామ్, వంశీ కోటు ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ది ట్రయల్'. స్మృతీ సాగి, శ్రీనివాస నాయుడు కిల్లాడ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 24న విడుదల కానుంది. "ఇప్పటివరకు తెలుగు తెరపై చూడని కంప్లీట్ ఇంటరాగేటివ్ కథతో, సరికొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌తో ఈ సినిమా కథనం ఉంటుంది" అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: శరవణ వాసుదేవన్, సహనిర్మాత: సుదర్శన్ రెడ్డి.

ప్రేమలో గీతాశంకరం


● ప్రియాంక, ముఖేష్ గౌడ

ముఖేష్ గౌడ, ప్రియాంకా శర్మ జంటగా కె.దేవానంద్ నిర్మిస్తున్న ప్రేమకథా చిత్రం 'గీతా శంకరం'. దీపావళి సందర్భంగా ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ముఖేష్ గౌడ మాట్లాడుతూ– "సీరియల్స్‌లో పేరు సంపాదించుకున్నట్లే ఈ సినిమాతో వెండితెరపై కూడా మంచి పేరు తెచ్చుకుంటాననే నమ్మకం ఉంది" అన్నారు. "నటనకు మంచి స్కోప్ ఉన్న పాత్ర లభించడం నా లక్‌గా భావిస్తున్నా" అన్నారు ప్రియాంకా శర్మ. "ఇరవై కథలు విన్నాం. కానీ రుద్ర చెప్పిన ఈ కథ నచ్చడంతో ఈ సినిమా చేస్తున్నాం. ఈ నెల 14న కొత్త షెడ్యూల్ ఆరంభిస్తాం" అన్నారు దేవానంద్. "ప్రేక్షకులకు నచ్చే అంశాలన్నీ ఈ సినిమాలో ఉంటాయి" అన్నారు రుద్ర. ఈ చిత్రానికి సంగీతం: అబు, కెమెరా: ఉదయ్ ఆకుల.

మంచి సినిమా అంటున్నారు - నిర్మాత సాయి సుధాకర్



"'అలా నిన్ను చేరి' చిత్రానికి ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. మరీ ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల ప్రేక్షకుల నుంచి ఎక్కువగా స్పందన వస్తోంది. వారంతా ఫస్ట్ హాఫ్‌కి ఎక్కువగా కనెక్ట్ అవుతున్నారు" అని కొమ్మాలపాటి సాయి సుధాకర్ అన్నారు. దినేష్ తేజ్, హెబ్బా పటేల్, పాయల్ రాధాకృష్ణ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'అలా నిన్ను చేరి'. మారేష్ శివన్ దర్శకత్వం వహించారు. కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మించిన ఈ సినిమా శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా కొమ్మాలపాటి సాయి సుధాకర్ మాట్లాడుతూ– "మా సినిమా చూసిన చాలామంది తమ జీవితాన్ని చూసుకున్నట్టుగా ఉందనడం సంతోషం. 'అలా నిన్ను చేరి' నిర్మాతగా మొదటి సినిమా అయినా కథకి అవసరం మేరకు ఖర్చు పెట్టా. సినిమా చూసిన మా నాన్నగారు బాగా తీశారని మెచ్చుకున్నారు. నా తర్వాతి సినిమా కోసం ప్రస్తుతం థ్రిల్లర్ జానర్‌లో ఓ కథ విన్నాను" అన్నారు.